


భోజనానికి లేవబోతున్న సుందరరామయ్య 'పోస్టు' అన్న కేక విని ఉత్తరం అందుకున్నాడు. అది తన కొడుకు సత్యం వ్రాసింది.

పూజ్యులైన తండ్రిగారికి,

సత్యం వ్రాయునది. ఈ ఉత్తరం మీకు బాధ కలిగించవచ్చు మీరు నన్ను స్వంత ప్రాణంకన్న ఎక్కువగా చూశారు. మెడికల్‌లో చేరేముందు మీలాగే సివిల్ సర్జన్‌గా రిటైర్ అవుతానని ఆశించి ఉంటారు. కాని ఏం చేస్తాను? నా శాయ శకుల ఈసారైనా పాసై పోదామని ప్రయత్నించాను కాని ఈసారి పరీక్ష కూడా నా కష్టం వేపు కాకుండా నా దురదృష్టం వేపు ఒరిగింది. ఏది ఏమైన మళ్ళా ఆశవాల్లో, ఎముకల్లో, దుమ్ముల్లో ఖుర్ర దూర్చి పరీక్షకి చదివే వోపిక పోయింది. అందుచేత మీకు ముందర చెప్తే ఒప్పుకోరని ఇక్కడే, ఈ వూర్లోనే ఒక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం సంపాదించుకోగలిగేను. నన్ను పువ్వుల్లో పెట్టి, పెంచి, పెద్దచేసిన మీ ఆశయాన్ని కూడా తీర్చుకోలేక పోయినందుకు నేను చాలా విచారిస్తున్నాను నా చేతకానితనానికి నన్ను అన్యధా భావించరని తలుస్తాను. ఇట్లు,

మీ కుమారుడు,

సత్యం.

వచ్చిన ఉత్తరం చదువుకున్న సుందరరామయ్యకి చాలా ఆశ్చర్యం వేసింది. అచ్చంగా తనలాంటి పరిస్థితులే కాకపోయినా, ఇంచుమించు అలాంటి పరిస్థితే ఇన్నేళ్ల తరువాత తన కొడుక్కి ఎలా వచ్చిందా అని.

ఆ రోజుల్లో తను ఇంటరు ఫస్టు క్లాసులో పాసయితే సంతోషించడానికి కూడా ఎవ్వరు లేక పోయారు, ఒక్క తన తాతయ్య తప్ప. తనకి పన్నెండో ఏడు వచ్చేసరికి తల్లి, తండ్రి ఇద్దరు లేకుండా పోయారు. ఉన్న ఆస్తిని జాగ్రత్తగా చూస్తూ తనకి ఏ లోపం రాకుండా జాగ్రత్తగా చూసాడు తాతయ్య మెడిసిన్‌లో సీటు వస్తే తన కన్నా ఎక్కువగా సంతోషించినవాడు తన తాతయ్య. వెళ్లేముందు "డబ్బుకోసం యిబ్బంది పడకు నాయనా, ఎంత కావలిస్తే అంత మొహమాటం పడకుండా రాయ"మని మరీ, మరీ చెప్పి పంపించాడు, స్వంత తల్లిదండ్రులకంటె ఎక్కువగా పెంచిన తాతయ్య.

వచ్చిన కొత్తల్లో చదువు బాగానే సాగింది. అసలు తను కూడా తన బాధ్యతని, తాతయ్య తనకోసం పడుతున్న అవస్థలని అన్ని ఆలోచించుకుంటూ జాగ్రత్తగానే చదువుకుంటూ ఉండేవాడు. కాని ఒకసారి అనుకోని సంఘటన ఒకటి జరగడంతో తన జీవితం ఇంచుమించు ఒక మలుపు తిరిగిపోయింది.

అవి కాలేజీ వార్షికోత్సవాలు. తను కొంచెం ఫిజియాలజీలో మంచి మార్కులు తెచ్చుకుంటుండడంవల్ల తనని తనతో ఉషాదేవిని ఫిజియాలజీ 'ఎగ్జిబిషన్' దగ్గర వచ్చినవాళ్లకి బోధపరచడంకోసం వేశారు ఉషాదేవి తన క్లాసులోనేవున్నా కూడా తనెప్పుడు ఉషాదేవిని అంత దగ్గర్నించి చూడలేదు అసలు ఎప్పుడు మాట్లాడలేదు కూడాను అందులోకి ఉషాదేవి తనతో చనువుగా మాట్లాడుతుంటే సినిమాల్లో, నవలల్లో చెప్పినట్టు పెద్ద ప్రేమలాంటిది కాకపోయినా, ఒక రకమయిన ఆకర్షణ మాత్రం ఉషాదేవి పట్ల కలిగింది. అసలీ సంఘటనే తనని చదువునుంచి మరలించడానికి పునాది అయింది. అసలు అప్పట్నించే తను ఉషాదేవితో మాట్లాడ్డానికి శత విధాల ప్రయత్నించేవాడు. కాలేజీలో ఎన్నికలనో,

